ప్రజాశక్తి
ఆదివారం 26 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం



మంచు వాకిట్లో మన్యం

గుమ్మలక్ష్మీపురం : గత మూడు రోజులుగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ లో దట్టమైన పొగ మంచు కురుస్తుంది. వేకువజామున 4 నుంచి ఉదయం 6 గంటల వరకు మంచు ప్రభా వం కనిపిస్తుంది. దీంతో ఏజెన్సీ అంతట మంచు దుప్పటి కప్పుకుంటుంది. దీంతో గుమ్మలక్ష్మీపురం, కురుపాం ప్రధాన రహదారిపై వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించిన పరిస్థితి. మంచు కురిసే సమయంలో వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు ఆరు బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.



కురుపాం- గుమ్మలక్ష్మీపురం రహదారిపై కురుస్తున్న మంచు



కాసుల సంపాదనే ధ్యేయంగా పెట్టుకున్న జిల్లాలోని ప్రయివేటు ట్రావెల్స్ యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడుతున్నా అపరాధ రుసుము సైతం చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారే బస్సులను నడుపుతుండడంతో పై నుంచి ఆదేశాలు వస్తే గానీ జిల్లా అధికారులు తనిఖీలకు సాహసించలేకపోతున్నారు. అక్కడక్కడా తనిఖీలు చేస్తున్నా మొక్కుబడిగానే ఉన్నాయి. ట్రావెల్స్ బస్సుల్లో సిటింగ్ ఉన్న చోట స్లీపర్ లను ఏర్పాటు చేస్తూ ప్రజల భద్రతను గాలికొదిలేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ బస్సులే ఎక్కువ

విజయనగరం నుంచి ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నడుపుతున్నారు. వీటిలో విజయవాడ, గుంటూరు, బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన పది బస్సులే కాకుండా ఒడిశా, పాండిచ్చేరి, నాగాలాండ్, డయ్యు డామన్ తదితర రాష్ట్రాలకు చెందిన బస్సులు ఎక్కువగా విజయనగరానికి వస్తున్నట్లు తెలుస్తోంది. మన రాష్ట్రంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు సీటింగ్‌ను బట్టి ట్యాక్స్‌లు ఎక్కువగా వేయడం వల్ల ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని మన రాష్ట్రాల నుంచి బస్సులను నడుపుతున్నారు.

ప్రయాణికుల భద్రత గాలికేనా?

- ప్రయివేట్ ట్రావెల్స్ ఇష్టారాజ్యం
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- 6 నెలల్లో 30 బస్సులపై కేసులు
- తాజాగా 3 బృందాలుగా తనిఖీలు
- జిల్లా కేంద్రంలో 4 బస్సులు సీజ్
- సీటింగ్‌ను స్లీపర్‌గా మార్చినట్లు వెల్లడి
- కర్నూలు బస్సు ప్రమాదంతో ప్రయాణికుల్లో ఆందోళన



ట్రావెల్ బస్సులో తనిఖీలు చేస్తున్న సిఐ గోవిందరావు

ప్రజాశక్తి- కంటోన్మెంట్ /పార్వతీపురంటౌన్

జిల్లా నుంచి ఉపాధి, ఉద్యోగ అవసరాలతో పాటు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, రైళ్లు తగినన్ని లేకపోవడంతో అధిక శాతం మంది బస్సుల పైనే ఆధారపడుతున్నారు. దీంతోపాటు జిల్లాలో వలసలు అధికంగా ఉండడంతో వలస కూలీలు సైతం అధిక సంఖ్యలో బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఆర్‌టిసి తగినన్ని బస్సులు నడపలేకపోవడంతో ప్రైవేట్ ట్రావెల్స్ నడుపుతున్న బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో ఏటా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల సంఖ్య పెరుగుతూనే ఉంది. విజయనగరం జిల్లాలో పది ట్రావెల్స్ బస్సులు రిజిస్ట్రేషన్ అయినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఇవికాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఆపరేటింగ్ చేస్తూ నడుస్తున్న బస్సులు 60 వరకు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు.

విజయనగరం జిల్లా కేంద్రం నుంచి విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు బస్సులు నడుస్తున్నాయి. రోజూ సుమారు 2వందల మంది వరకు ప్రయాణిస్తున్నారు. పండగ సీజన్‌లో ప్రయాణం చేసే వారు వేలల్లోనే ఉంటున్నారు. అయితే ఈ బస్సుల్లో పండగ సీజన్‌లో అధిక ఛార్జీలను వసూలు చేయడం, సరైన పత్రాలు లేకపోవడం, అతి వేగం, ప్రమాదకర డ్రైవింగ్ వంటి అంశాలపై అధికారులు అనేక సందర్భాల్లో కేసులు నమోదు చేస్తూనే ఉన్నారు. బస్సులకు డేంజర్ లైట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం వంటి వాటితో పాటు చిన్న చిన్న అంశాలను సైతం యాజమాన్యాలు విస్మరిస్తున్నాయి. అధికారులు చేపడుతున్న తనిఖీల్లో అనేక లోపాలు బయటపడుతున్నాయి. వాటిపై అధికారులు అపరాధ రుసుము విధిస్తున్నా చెల్లించకుండా ఎగవేస్తున్నారు.

విజయనగరంలో తనిఖీలు

కర్నూలు జిల్లాలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు జరిగిన ప్రమాదంతో విజయ నగరంలో నాలుగు బృందాలుగా రవాణాశాఖ అధికారులు ఏర్పడి శనివారం తనిఖీలు చేపట్టారు. రవాణా శాఖ కమిషనర్ డి.మణికుమార్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. నాలుగు బస్సుల్లో సీటింగ్‌ను స్లీపర్‌గా మార్చినట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు రాజాపులోవ వద్ద ఒక బృందం, చెల్లూరు వద్ద మరో బృందం తనిఖీలు చేపట్టాయి.

పలు ప్రైవేటు బస్సులలో తనిఖీలు.

విజయవాడ నుండి పార్వతీపురం పట్టణానికి వచ్చే పలు ప్రైవేటు బస్సులను, పట్టణ ఎస్ఐ గోవిందరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తనిఖీ చేశారు. బస్సు ఫిట్నెస్ సర్టిఫికెట్లను పరిశీలిస్తూ, బస్సులో అనుకోకుండా ప్రమాదం సంభవిస్తే ప్రయాణికుల భద్రత విషయంలో యాజమాన్యం ఏర్పాటు చేసే రక్షణ ఏర్పాట్లను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్ లు,సిబ్బందితో మాట్లాడుతూ, మితిమీరిన వేగంతో ప్రయాణ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదమని సూచించారు.

తుపానుతో అధికారులు అప్రమత్తం


ప్రజాశక్తి - పార్వతీపురం

మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. రాబోయే 72 గంటలు అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తమై, తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ ముందస్తు ఏర్పాట్లపై డిఆర్ఓ కె.హేమలతతో కలిసి సమీక్షా సమావేశాన్ని శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో జేసీ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి అధికారులకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి జిల్లా కలెక్టర్ సెలవులను రద్దు చేసినట్లు జేసీ చెప్పారు. అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉందని అన్నారు. కావున అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అవసరం మేరకు ముందుగా పునరావాస ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పునరావాస కేంద్రాల గుర్తింపుతో పాటు ఆహారపు ఏర్పాట్లలో తహశీల్దార్లు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎస్‌డిఆర్ఎఫ్ బృందం సీతంపేట మండలంలో ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులు శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల్లో ఉండరాదని, గర్భిణుల భద్రత దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్, తాగునీటి సరఫరా - పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్యం తదితర శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన కేంద్రం విడిచి వెళ్లరాదని జేసీ స్పష్టం చేశారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ జి.నాగభూషణరావు, డిఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎ.విజయశాంతి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి ఆదేశించారు. శనివారం ఆమె ఛాంబరులో అధికారులతో సమీక్షించారు. మండల తహశీల్దార్లు, విఆర్ఓలు, సిబ్బంది ప్రధాన కేంద్రాలలో ఉండాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆమె తెలిపారు. విద్యుత్, ఆర్ అండ్ బి, పంచాయతీ, వైద్య ఆరోగ్యం, రెవిన్యూ, పౌర సరఫరా తదితర శాఖలు అప్రమత్తం కావాలని తేల్చిచెప్పారు. అంతకుముందు వివిధ రాజకీయ పక్షాలతో త్రైమాసిక సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సెలవులు రద్దు
విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08963 796085


జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08963 796085 అని చెప్పారు. ఏమైనా అవసరముంటే కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరుకి ఫోన్ చేస్తే, వెంటనే సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్న మూడు రోజుల వరకు జిల్లా అధికారులు, తహశీల్దార్లు, విఆర్ఒలు, సిబ్బంది ప్రధాన కేంద్రాల్లో ఉండాలని స్పష్టం చేశారు.

విద్యార్థుల మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం : సిపిఎం

- గిరిజన మంత్రి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి
- రూ.50 లక్షలు నష్టపరిహారమివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు వరుసగా కొనసాగుతున్నాయని, శుక్రవారం హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి చాలా అమానుషమని, విద్యార్థుల మృతులపై ప్రభుత్వం నేటికీ స్పష్టమైన వైఖరికి రాకపోవడంతో ప్రభుత్వ హత్యలగానే భావిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఇందిరా, ఎం.తిరుపతిరావు, ఎన్.వై.నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గడిచిన రెండు నెలల్లో విద్యార్థుల మరణాలు ఏడుకు చేరిందని, ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మరణాల పట్ల జిల్లా అధికారులు, మంత్రులు, ప్రభుత్వ నిర్లక్ష్యం చాలా స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. మరణాల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమని మండిపడ్డారు. దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. పచ్చకామెర్లతో, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలతో మరణించిన గిరిజన విద్యార్థులకు నష్టపరిహారం రూ.50 లక్షలు చొప్పున ఇవ్వాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎఎన్ఎంలను నియమించాలని, పరిశుభ్రత తాగునీరందించి, మెనూ ఛార్జీలు పెంచేలా చర్యలు చేపట్టాలని సిపిఎం, వామపక్షాలు, ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తూ ఈనాటి వరకు అనేక రూపాల్లో పోరాటాలు చేస్తూనే ఉన్నాయని, అయినా వాటిని ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం అన్యాయమని అన్నారు. చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గిరిజన విద్యార్థుల మరణాలకు తన బాధ్యత కాదన్నట్టు బహిరంగంగా ప్రకటన చేయడం బాధ్యతారాహిత్యమని, ఈ ప్రకటనను ప్రజలంతా తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మంత్రి స్పష్టంగా గిరిజన మరణాలకు తన బాధ్యత లేదనుకుంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిగా బాధ్యత స్వీకరించిన పిదప ఎఎన్ఎంలను నియమిస్తానని తొలి సంతకం చేసింది మీరు కాదా అని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, గిరిజన విద్యార్థుల మరణాలకు బాధ్యులనుకాదని చెప్పి తప్పించుకోవడం గిరిజనులను మోసగించడమేనన్నారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేస్తామన్న హామీ కేవలం ప్రకటనకే పరిమితమవుతున్నాయని, ఆచరణలో ఎటువంటి ప్రభుత్వ ప్రయత్నం లేదని తెలిపారు. కావున ఇకనైనా ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో స్పందించి మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, సుమారుగా మరో 200 మంది విద్యార్థులు ఇప్పటి వరకు కురుపాం పాఠశాలకు వెళ్లకుండా వైద్యం నిమిత్తం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని, వారికి మెరుగైన వైద్యం అందించి, రూ.50వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే ఎఎన్ఎంలను నియమించి పాఠశాలలలో మరుగుదొడ్లు, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

మలేరియా రహిత సమాజానికి సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామంలోని ప్రతి ఒక్కరూ మలేరియా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మలేరియా రహిత సమాజం కోసం సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి కోరారు. మండలంలోని గొరడ గ్రామంలో శనివారం నిర్వహించిన 'మా ఊరికి మలేరియా వచ్చింది' అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొరడలో ఒక్క మలేరియా కేసు కూడా రాకూడదని, అందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని మాట ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మలేరియా వ్యాప్తిని అరికట్టడానికి, ప్రజల్లో అవగాహన పెంచడానికి గొరడలో 'మా ఊరికి మలేరియా వచ్చింది' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు యాక్టివ్ మలేరియా కేసులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో మలేరియా సోకిన గ్రామంలో, దానికి 2 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని నివాస ప్రాంతాలలో, పాఠశాలలు, ఆసుపత్రులలో ఈ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరికీ మలేరియా గురించి, ముఖ్యంగా తమ చుట్టూ మలేరియా ఉందని తెలుసుకోవాలనే అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. మండలంలోని అధికారులందరూ గ్రామాన్ని సందర్శించి, ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించడం, మలేరియా సోకిన వ్యక్తి ద్వారా దోమలు ఇతరులను కుడితే వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. మలేరియా నివారణ కోసం కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అందులో దోమలు కుట్టకుండా తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, పూర్తిస్థాయి పొడవాటి చొక్కాలు, ప్యాంట్లు ధరించాలని సూచించారు. కర్పూరం వేసిన నూనెను బహిరంగ ప్రదేశాల్లో రాసుకోవాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయించాలని చెప్పారు. దోమలకు నచ్చని బంతి, చామంతి, నిమ్మగడ్డి వంటి మొక్కలను ఖాళీ స్థలాల్లో, గట్ల వెంబడి పెంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చని వివరించారు. ఎవరికైనా ఆగకుండా జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే, వెంటనే వారి ఎఎన్ఎంకు ఫోన్ చేస్తే, వారు ఇంటి దగ్గరే ఆర్‌డిటి కిట్స్ ద్వారా పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ వైద్య సేవలు, పరీక్షలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. గ్రామంలో యువత, ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు మలేరియా నివారణ గురించి తెలుపుతూ, అనుసరించే విధంగా ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని, మలేరియా రహిత సమాజం కోసం సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, ఎంపిడి ఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ నిమ్మక శేఖర్, ఎంఇఒ చంద్రశేఖర్, సచివాలయం ఉద్యోగులు, ఇతర వైద్యాధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఐటిఐ ద్వారా ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిఐ శిక్షణల ద్వారా విద్యార్థులు విస్తృత ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక ఐటిఐ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న అన్ని ట్రేడ్ల ల్యాబ్‌లను పరిశీలించారు. ల్యాబ్‌లో నిర్వహణ బాగుందన్నారు. అదే విధంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఐటిఐ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత దూరప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని ఆ అవకాశాలను వదులుకోవద్దని అన్నారు. దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయడం వల్ల అనుభవం వస్తుందని సూచించారు. దూరప్రాంతాలకు వెళ్లలేని వారు స్వయం ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,670 దోమ తెరలు

ప్రజాశక్తి - పార్వతీపురం

రెడ్ క్రాస్ సంస్థ ద్వారా జిల్లాకు 1,670 దోమ తెరలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా దోమ తెరలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ దోమ తెరలు ఆవశ్యకతను గుర్తించి రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ వైడి రామారావుతో మాట్లాడి జిల్లాకు దోమతెరలు తెప్పించినట్లు కార్యక్రమంలో పార్వతీపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్లు డా. పి.శ్రీరాములు, సి.బాల సంతోష్, పి. జగన్మోహనరావు, ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, జిల్లా సమన్వయకర్త వై.జనార్దనరావు, పెంకి చైతన్య, సత్యనారాయణ, సంతోష్, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

- మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు నష్టపరిహారం ప్రకటించాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్
- మూడోరోజు కొనసాగిన జీపు యాత్ర

ప్రజాశక్తి- గరుగుబిల్లి/పాలకొండ/వీరఘట్టం/సీతానగరం

గిరిజన విద్యార్థుల వరుస మరణాలు ప్రభుత్వం హత్యలేనని, అనారోగ్యంగంతో మృతి చెందిన హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థి మృతికి ప్రభుత్వం రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లావ్యాప్తంగా చేపడుతున్న జీపు యాత్ర శనివారం గరుగుబిల్లి, పాలకొండ, వీరఘట్టం, బలిజిపేట, సీతానగరం మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల మరణాలను నిరసిస్తూ ఆయా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం టి.అఖిల్, మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తక్షణమే ఎన్ఎంలను నియమించాలని, పాఠశాలలు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో 14 మంది విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. కురుపాం గురుకుల పాఠశాలలో 611 మంది విద్యార్థులకు 16 రూములు ఏర్పాటు చేయడం, అలాగే ఒక రూమ్‌కు 40 మంది విద్యార్థులు ఉంటున్నారని అన్నారు. తరగతులు, వసతి, భోజనాలు ఒకేచోట ఉండడం దారుణమన్నారు. సురక్షితమైన మంచినీరు లేదని, ఆర్వో ప్లాంట్ ఉన్నా పని చేయడంలేదని, మరుగుదొడ్లు కూడా సరిపడా లేవన్నారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ గురుకుల హాస్టల్ లో ఇదే దుస్థితి నెలకొందిని అన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా ఛార్జీలు పెంచాలని, అయినా పెంచలేదన్నారు. అలాగే అధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్నారు. విద్యార్థులు మరణిస్తే హడావిడిగా హాస్టళ్లను సందర్శించి వారు తప్పును కప్పిపుచ్చుకోడానికి కింద స్థాయి సిబ్బందిపై వేటు వేయడం దుర్మార్గమన్నారు. హాస్టల్లో ఎఎన్ఎం నియమిస్తామని గిరిజనశాఖా మంత్రి ఇచ్చిన హామీ 15నెలలైనా అమలుకాకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఎఎన్ఎంలను నియమించాలని, అనారోగ్యంతో మృతి చెందిన 14మంది విద్యార్థుల కుటుంబాలకు రూ.50లక్షలు, ప్రభుత్వ ఉద్యోగ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఐక్యంగా విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శరత్, నాయకులు దినేష్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.




పాలకొండలోని ఆశ్రమ పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

బలిజిపేటలో ప్రభుత్వ డిగ్రీకాలేజీ పెట్టాలి

బలిజిపేట : మండల కేంద్రమైన బలిజిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జీపుయాత్ర బలిజిపేటకు శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో పచ్చకామెరులతో విద్యార్థులు మరణిస్తున్నారని, శుక్రవారం సీతంపేట మండలం హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి మరణించిందని అన్నారు. విద్యార్థుల ఇలా పిట్టల్లారాలిపోతున్నా గిరిజన శాఖ మంత్రి, ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నష్టపరిహారం ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చెల్లించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ బలిజిపేటలో డిగ్రీ కళాశాల పెడతామని చెప్పి గత ప్రభుత్వం ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికి రెండేళ్లవుతున్నా అవుచేయ లేదన్నారు. దీంతో మండలంలో విద్యార్థులు బొబ్బిలి, రాజాం చదువు కోసం వెళ్లాల్సిన పరిస్తితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలి నుంచి ప్రయివేటు తోవే



ప్రజాశక్తి -విజయనగరం ప్రతినిధి

పేదల అభ్యున్నతి కోసమే తమ పార్టీ పుట్టిందంటూ చెప్పుకుంటున్న టిడిపి మెడికల్ కళాశాలల విషయంలో తొలి నుంచీ ప్రైవేటు తోవే అవలంభిస్తోంది. వాస్తవానికి జిల్లాలో మెడికల్ కళాశాల ప్రతిపాదన ఈ నాటిది కాదు. రాష్ట్ర విభజన సమయంలో వివిధ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా నాటి టిడిపి ప్రభుత్వం విజయనగరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెప్పింది. అప్పట్లో జిల్లా టిడిపిలో కీలకంగావున్న నేటి గోవా గవర్నర్ మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తామంటూ ముందుకు వచ్చారు. ఇలా అయితే ప్రైవేటు పద్ధతిలో ఏర్పాటు చేసినట్టుగా భావించిన సిపిఎం, సిపిఐ, లోక్ సత్తా తీవ్రంగా వ్యతిరేకించాయి. నాడు ప్రతిపక్షంలోవున్న వైసిపి కూడా ఇందుకు అనుగుణంగానే గొంతు కలిపింది. విద్యకోసం ఎన్నో ఆస్తులను త్యాగం చేసిన తన తండ్రి ఏకంగా ఆర్ట్స్, సైన్స్ అభివృద్ధికి ఎన్నో ఇనిస్టిట్యూట్స్ ఏర్పాటు చేశారని, వారి కల నెరవేర్చేందుకు మాన్సాస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తామని ప్రభుత్వాన్ని అశోక్‌గజపతిరాజు అప్పట్లో ఒప్పించారు కూడా. ఈ పేరుతో విజయనగరంలోని డాబాగార్డెన్స్, భీమిలి పరిసర ప్రాంతాల్లోని భూములను ఉడా ఆధ్వర్యాన సుమారు రూ.200కోట్లుకు విక్రయించినట్టు కూడా చాలా మంది చర్చించుకున్నారు. తీరా ఆస్తులు విక్రయించాక కాలేజీ ఏర్పాటుపై చేతులెత్తేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక తొలిదశలోనే విజయనగరంలో వైద్య కళాశాల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేసింది. ప్రారంభంలో స్థలం గుర్తింపుకోసం కాస్త ఆలస్యం అయినప్పటికీ, శంకుస్థాపన తరువాత పనులు బాగానే ముందుకు సాగాయి. కళాశాల ప్రభుత్వ రంగంలో నిర్మించినప్పటికీ 150సీట్లలో 50శాతం సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లుగా నిర్ణయించారు. దీంతో, అప్పట్లోనే ఈ కళాశాల సగం ప్రైవేటుగా మారింది. ఇలా ప్రభుత్వ కాలేజీలో ప్రైవేటు సీట్లు ప్రకటించడం పట్ల సిపిఎం, ఎస్ఎఫ్ఐ అప్పట్లో తీవ్రంగా తప్పుపట్టాయి. గత ఎన్నికల్లో జిల్లాకు వచ్చిన టిడిపి యువనేత నారా లోకేష్ కూడా తాము అధికారంలోకి వస్తే 100శాతం సీట్లు ప్రభుత్వం రంగంలో ఉంచుతామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక స్వరం మారిపోయింది.

ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి పూర్తిగా పిపిపి విధానం పేరిట ప్రైవేటు పరం చేసేందుకు పావులు కదుపుతోంది. దీన్ని వామపక్షాలతోపాటు పలు సంఘాలు, ప్రజా ధృక్కోణంగల వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. పేదలకు వైద్యం అందాలంటే వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే ఉండాలి. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండబోదు. ఫీజులు కట్టుకోలేక వైద్య విద్యకు దూరం అయ్యే అవకాశాలు ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇబిసి రిజర్వేషన్లు వర్తించే పరిస్థితి కూడా ఉండబోదు. పేదలకు వైద్య సేవలకు ఖరీదుగా మారుతాయి.

ఈ నేపథ్యంలో పిపిపి విధానం వెనక్కి తీయిసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఇందులో పాల్గొన్న వైద్యులు, వివిధ సంఘాల నాయకులు మెడికల్ కాలేజీ ప్రైవేటీపరం ఆలోచనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు నుంచే ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కూడా వ్యతిరేకత తెలిపింది. మెడికల్ కళాశాల అభివృద్ధి పనులను కూడా పరిశీలించారు. సిపిఎం, సిపిఐ తొలి నుంచీ ప్రభుత్వ ఆలోచను ఖండిస్తున్నాయి. తాజాగా వైసిపి నేతలు కూడా దీనిపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 28న మరోసారి నిరసన కార్యక్రమానికి ఆ పార్టీ పిలుపునిచ్చింది.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పై శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ వైశాలి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్వతీపురం మండల తహశీల్దార్ సురేష్‌తోపాటు బలిజిపేట, సీతానగరం మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఇంకెంత మంది మరణించాలి?

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంకెంత మంది గిరిజన విద్యార్థులు మరణించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 14 మంది గిరిజన విద్యార్థులు జ్వరాలబారినపడి మరణించారని, కనీసం పరిహారం ఇవ్వడం గాని, ఆ కుటుంబాలను ఆదుకోవడం గానీ రాష్ట్ర ప్రభుత్వం చేయకపోవడం చాలా దుర్మార్గమని రంజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల వైద్య సేవలు కోసం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో గతంలో పనిచేసిన ఎఎన్ఎం ఆరోగ్యం హెల్త్ వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మృతి చెందిన మండంగి కవిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం గిరిజన విద్యార్థుల ప్రాణాలకు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మరణాలన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని పునరుద్ఘాటించారు. గిరిజన విద్యార్థులకు, ప్రజలకు తక్షణమే దోమ తెరలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



రిగ్గు బోరును బిగిస్తున్న సర్పంచ్

తాగునీటి బోరు ఏర్పాటు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండలం లోని గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూరలో ఎట్టకేలకు అధికారులు తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. 'అధికారులు వస్తేనే తాగునీరు... లేకపోతే అసలు రాదు' అన్న ప్రజాశక్తి వార్తకు అధికారులు స్పందించారు. దండుసూర గ్రామస్తులు ఇప్పిన సమాచారం మేరకు సమావేశాలు లేదా ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నాయంటే ముందుగా అధికారులు వచ్చి మరమ్మతులకు గురైన బోరుకు తాగునీటి పథకాలను మరమ్మతులు చేయిస్తే తాగునీరు అందిస్తారు. మళ్లీ వారు వెళ్లిపోయిన తర్వాత యథాస్థితిగా నీరు రాకుండా ఉంటుంది. దీంతో గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, కొత్తగా బోరు నిర్మించి తాగునీరు సక్రమంగా ప్రజలకు అందించాలని 'ప్రజాశక్తి'లో కథనం వెలువడింది. ఈ వార్తకు స్థానిక సర్పంచ్ శెట్టి సురేష్, అధికారులు స్పందించి శనివారం కొత్త బోరు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ 'ప్రజాశక్తి'లో వెలువడిన కథనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్త బోరు నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

27న ఓపెన్ హౌస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పోలీస్ అమరుల వారోత్సవాలు సందర్భంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు పోలీస్ ఎంటి పార్క్, చాకలి బెలగాం వద్ద ఓపెన్ హౌస్ కార్యక్రమం జరుగుతుందని పట్టణ పోలీస్ స్టేషన్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక సరికొత్త ఆయుధాలు ఏ విధంగా పని చేస్తున్నాయనే, వాటి గురించి నిపుణులచే క్షుణ్ణంగా వివరించనున్నట్లు తెలిపారు. అనంతరం పోలీస్ జాగిలాలచే (పోలీస్ డాగ్స్) వివిధ కార్యక్రమాలు జరుగుతాయని, ఈ కార్యక్రమం గురించి తెలుసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు, విద్యార్థులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని ఎం.సింగు పురంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచనలు మేరకు మండల పరిషత్ 15వ ఫైనాన్స్ నిధుల నుంచి లక్ష రూపాయలతో తాగు నీటి బోరును ఎంపిపి బొమ్మాలి భాను సుధాకర్ ప్రారంభించారు. ప్రజల అవసరాలు తీర్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు . కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యులు నిమ్మక దుర్గమ్మ, ఎం.సింగుపురం జనసేన నాయకులు రవికుమార్, మాజీ ఎంపిటిసి సభ్యులు రణస్థలం సూర్యనారాయణ, అర్దలి గ్రామ నాయకులు పొగిరి వెంకటరమణ, మజ్జి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత అడ్మిషన్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఆంధ్రాయూనివర్సిటీ ఆదేశాలు, సూచనలు మేరకు మూడవిడత డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియను విద్యార్థులు సంప్రదించాలని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు అధ్యాపకులు, సిబ్బంది కళాశాల కార్యాలయంలో అందుబాటులో ఉండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మొదట, రెండవ విడతలో సీట్లు కేటాయించిన విద్యార్థులు కళాశాల కార్యాలయంలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని కళాశాలలో బిఎ, బికామ్, బిఎస్సీ కోర్సులకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఈనెల 25, 26 తేదీల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని, ఈ నెల 25 నుండి 27వరకు ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ ఉంటుందని, నవంబర్ 1న డిగ్రీ సీట్లు కేటాయింపు ఉంటుందని, నవంబర్ 1నుండి 4లోగా రిపోర్టింగ్ చేయాలని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుష్ప్రచారంపై చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భామిని

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై, భామిని మండలం సోషల్ మీడియా గ్రూపులో కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్యే జయకృష్ణపై తీవ్రస్థాయిలో దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ అంశం పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు నివేదిస్తామని టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవినాయుడు, మేడిబోయిన జగదీశ్వరరావు అన్నారు. భామిని టిడిపి కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల కూటమి నాయకుల విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం శత శాతం సూపర్ సిక్స్ అమలు చేసిందని, వైజాగ్‌లో గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని, భవిష్యత్తులో ఎందరికో ఐటి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, మెగా డిఎస్సి ద్వారా 16,500 మంది నిరుద్యోగులు నేడు ఉపాధ్యాయులుగా మారారని ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు అన్నారు. ఈ అంశంపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని, ఇక నుంచి కూటమి ప్రభుత్వంపై, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేపై చేసే దుష్ప్రచారాన్ని ఉపేక్షించబోమని భామిని సర్పంచ్ ప్రతినిధి లోపింటి రాజేష్ అన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు అంపిలి కేశవరావు, పి.నాగేశ్వరరావు, బిడ్డిక ప్రసాద్, సాకేటి రామారావు, ఆర్ అమిడి గోవిందరావు, మన్మథ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డిఇఒ బి.రాజకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి పదో తరగతి ప్రవేశాలకు రెగ్యులర్ ఎస్ఎస్‌సి పాత సిలబస్‌లో ఉత్తీర్ణత సాధించకపోయినా సార్వత్రిక విద్యాపీఠంలో చేరే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. అందుకు విద్యార్థులు ఈనెల 31 లోగా రూ. 300 చెల్లించి సార్వత్రిక విద్యాపీఠంలో పదవ తరగతి చేరవచ్చునని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా కో ఆర్డినేటర్ యం. సుధాకరరావు, ఫోన్ నెంబర్ 8790335145, 8500100223 కు సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

మన్యం అందాలను చూద్దాం రారండి

కార్తీకమాసం రానే వచ్చింది. పర్యాటకుల సందడి ప్రారంభమైంది. దీంతో ఎక్కడికక్కడ పర్యాటక ప్రాంతాలు ప్రజల కోసం కొత్తకొత్త హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు నిర్వాహకులను పర్యాటక కేంద్రాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అందులో సీతంపేట మండలం ప్రకృతి శోభకు పుట్టినిల్లు. ఇక్కడి పర్యాటక ప్రాంతాలను అరుకు అందాలను తలపించేలా ఇక్కడ ఇమిడి ఉన్నాయి. ప్రకృతి మైమరిపించే అందాలు... జలజలలాడే జలపాతాలు... సెలయేళ్లు పరుగులు తీస్తాయి. ఓంపు సొంపులతో కొండలు మన కన్నా ముందు పరుగు తీసే నీలి మేఘాలు ఆకాశానికి కొండలు తాకుతున్నట్లు అనిపిస్తాయి. మరోవైపు కొండలపై ప్రాంతాల వైపు పర్యటిస్తే పచ్చని పొలాలు... ప్రకృతి సహజసిద్ధమైన పైరు గాలి పర్యాటకుడి గుండెను తాగుతుంటే చెప్పలేని అనుభూతి పొందుతాడు. ఇక కనువిందు చేసే యు పాయింట్స్, జలపాతాలు రిసార్ట్స్ అడ్వెంచర్ పార్క్ లో బోట్ షికారు ఇక ప్రకృతి ప్రేమికులు అందాలను ఆశ్వాదించడమే.

◆ ప్రారంభం కానున్న పిక్నిక్ సందడి ◆ కిటకిటలాడనున్న పర్యాటక ప్రాంతాలు

ప్రజాశక్తి - సీతంపేట

మన్యం జిల్లాలో ప్రధాన పర్యాటక కేంద్రం సీతంపేట. ఈ ప్రాంతంలో అందాలను తిలకించేందుకు ఉత్తరాంధ్రా జిల్లాలతో పాటు ఒడిశా నుంచి కూడా అనేక మంది ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. శ్రీకాకుళం నుంచి నేరుగా పాలకొండకు 38 కిలోమీటర్లు, విజయనగరం నుంచి వస్తే 90 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పాలకొండ చేరుకోవాలి. అక్కడనుండి సీతంపేటకు 13 కిలోమీటర్లు ఉంటుంది. సీతంపేటలో ప్రవేశించగానే టిటిడి దేవాలయం దర్శనమిస్తుంది. అక్కడ నుంచి స్థానిక బస్టాండ్ నుండి ఐటిడిఎ పెట్రోల్ బంక్ మీదుగా ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌కు చేరుకోవచ్చు. అక్కడ నుంచి పర్యాటకులు ముందుగా అడ్వెంచర్ పార్కులో అడుగు పెడతారు.



ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు ముఖ ద్వారం



ఆడలి యు పాయింట్ వద్ద పర్యాటకుల సందడి

సీతంపేట ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. ఎందుకంటే ఈ పార్క్ ఇప్పటికే ఆంధ్ర -తెలంగాణ తెలుగు రాష్ట్రాల్లో కాకుండా ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. ఇక సోమవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. ఈ కార్తీక మాసంలో వేలాదిమంది పర్యాటకులు తరలివస్తారు. అంతేకాకుండా వేసవిలో పర్యాటకులు చల్లని ప్రదేశంలో సేద తీరడానికి తరలివస్తారు. ఇక అడ్వెంచర్ పార్క్‌లో చిన్నతనంలో గుర్తుకొచ్చే గేదెపై కూర్చొని బొమ్మలు తాడు ఆటలు, అష్టా- చమ్మ వంటివి దర్శనమివ్వడంతో రక్కుమని చిన్నతనం గుర్తుకొస్తుంది. జలవిహార్ వద్ద బోటు షికారు చేస్తుంటే మధ్యలో హ్యాంగింగ్ బ్రిడ్జిపై నీటిపై నడక యువతీ యువకులు నడుస్తుంటారు. ఆకాశంలో స్కై సైకిల్ తొక్కుతూ విహారం చేస్తుంటే రోడ్డు పక్కనుంచి వాహనాలు రయ్... రయ్.. మంటూ పరుగులు తీస్తుంటాయి. ఆల్ట్రాన్ వెహికల్‌లో పార్కులో చుట్టూ ముడతారు. చిన్నారులు చిల్డ్రన్ పార్కులో కమాండనెట్ ఎక్కి ఆడకుంటారు. చిన్నపిల్లలు స్విమ్మింగ్ చేస్తారు. గన్ షాట్ విలువిద్య ఎక్కు పెడతారు. గుర్రం లాంటివి ప్రత్యేకంగా దర్శనమిస్తాయి. సాహసోపేతమైన క్లైమ్బింగ్ వాల్ బెంజి టెంపో లైన్, సైడింగ్ బీన్స్, ఫోటో పాయింట్ వంటివి ఉన్నాయి.. ఫైవ్ డి థియేటర్లో అబ్బురు పరిచే హర్రర్ పిక్చర్స్ వీక్షించవచ్చు. మన మీద పులులు, సింహాలు పడినట్లుగా అను భూతి కలుగుతుంది. ఇక సాయంత్రం ఆనంద్ విహార వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా యువతీ యువకులు డాన్సులు వేస్తూ అలరిస్తారు.



పార్కులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు



పార్కులో ఏర్పాటు చేసిన బాలుర శిల్పాలు

ఆడలి యు పాయింట్ సీతంపేటలో ఒక ప్రత్యేకత గుర్తింపు తెచ్చుకుంది. ఇది సీతంపేటకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వాహనం ద్వారా కొండలపై నుంచి వెళ్లాలి. ఎత్తైన కొండలు, ఒంపు సొంపులతో ఎత్తైన కొండలు, పచ్చని పొలాలు, పైరు గాలులు మన గుండెను తాకుతుంటే ఆ ఆనందం వేరే చెప్పవసరం లేదు. అక్కడ నుంచి ఆడాలి యు పాయింట్ నుంచి చూస్తే హిరమండలం రిజర్వాయర్ ప్రాజెక్టు, శ్రీముఖలింగం పుణ్యక్షేత్రం కనుచూపుమేర కనిపిస్తాయి. మూడు నాలుగు మండలాలు చిన్న చిన్న గ్రామాలు మాదిరిగా కనిపిస్తాయి. సీతంపేటకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న జగత్ పల్లి యు పాయింట్ ఉంటుంది. అక్కడ నుంచి ఎత్తయిన కొండపైన యు పాయింట్ కనిపిస్తుంది. దీంతో పాటు మరో 7 కిలోమీటర్లు సున్నపుగెడ్డ జలపాతాలు ఎంతో ప్రసిద్ధిగాంచాయి. ఎత్తైన కొండల నుంచి జలజలలాడే జలపాతాలు మువ్వలు సవ్వడితో సెలయేర్లు పారుతుంటాయి. పొల్ల యు పాయింట్ దర్శనమిస్తాయి. అడ్వెంచర్ పార్క్ నుండి మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న మెట్టుగూడ జలపాతం దర్శమిస్తుంది. కొండపై నుంచి జలపాతాలు జారుతుంటాయి. పర్యాటకులు జలకలలాడుతారు. అందమైన పగోడాలు కనిపిస్తాయి పర్యాటకులు ఫోటోలో దిగుతారు. ఇలా చెప్పుకొనే కంటే వెళ్లి చూసి వస్తే సరి...

కంచె తొలగించండి

ప్రజాశక్తి- బలిజిపేట

ప్రభుత్వ భూముల్లో అక్రమ కంచెలను తొలగించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ ఆర్.వైశాలికి మెట్ట కాలనీ ప్రజలు ఏకల సన్యాసి, మొగడ పోలారావు వినతి పత్రాన్ని అందిం చారు. వారు మాట్లాడుతూ బలిజిపేట గ్రామంలో మెట్ట కాలనీలో సర్వే నంబర్ 32/3లో కొంతమంది ప్రభుత్వ భూమి రాయి మెట్ట చుట్టూ కంచె వేశారన్నారు. గతంలో ఈ మెట్టపై మంచినీళ్ల ట్యాంకు కట్టాలని అప్పటి రెవెన్యూ అధికారులు ప్రభుత్వం పెద్దలు నిర్ణయించారు కానీ మెట్ట కాలనీలో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ భూమికి చుట్టూ కంచెలు, ప్రహరీ గోడలు కట్టి కబ్జా చేస్తున్నారని ప్రజా అవసరాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ మెట్ట భూమిని కొంతమంది స్వార్థపరులు కాసులకు కక్కుర్తి పడి ఈ విధంగా ఆక్రమిస్తున్నారి చెప్పారు. ఇప్పటికై ఈ విషయంపై తహశీల్దార్‌కు మూడు సార్లు విన్నవించి నప్పటికీ సమస్య పరిష్కారం చేయలేదన్నారు. తక్షణమే స్పందించిన సబ్ కలెక్టర్ పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. సబ్ కలెక్టర్ చెప్పినట్టు కంచెను తొలగించాలని లేకపోతే రెవెన్యూ కార్యాలయం ముందు టెంటు వేసి దీక్ష చేపడతామని వారు హెచ్చరించారు.



వినతిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

టిడిపి మండల అధ్యక్ష పదవి ఎవరికి దక్కేనో?

ప్రజాశక్తి - పాలకొండ

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి గట్టి పోటీ కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జనసేన ఎమ్మెల్యే ఇక్కడ ప్రాతినిధ్యం చేయడంతో మండల పార్టీ పీఠానికి గిరాకీ పెరిగింది. ప్రస్తుతం ఉన్న మండల పార్టీ అధ్యక్షులు గండి రామి నాయుడుతో పాటు పలువురు పోటీ పడుతున్నారు. అయితే రామినాయుడుకు తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఉండడంతో వేరే వారికి ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది తంపట ఉపసర్పంచ్ జాడ శ్రీధర్ పేరు ప్రధానంగా వినిపిస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరపున జనసేన ఎమ్మెల్యేకి శ్రీధర్ కష్టపడి పని చేశారని, ఆయనకు పార్టీ పార్టీ పగ్గాలు అప్పగించాలని పలువురు కోరుతున్నారు. అలాగే గోపాలపురానికి చెందిన జయశంకర్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే జయ శంకర్‌ను ఒక గ్రూపు పూర్తిగా వ్యతిరేకిస్తుంది. ప్రస్తుతం ఉన్న మండల పార్టీ అధ్యక్షుల ఎన్నికల ముందు తాను ఎంతో పార్టీ పని చేశానని, తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తుంది. అయితే ఎవరికీ పదవి వరుస్తుందో వేచి చూడాల్సి ఉంది.



రామినాయుడు



జయశంకర్



శ్రీధర్

పేలుళ్ల బాధితులకు రూ.9.75 లక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ పార్శిల్ కౌంటర్ వద్ద ఈనెల 19న దీపావళి సామగ్రి పేలుడు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో గాయపడి, వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అండగా నిలిచారు. శుక్రవారం విజయవాడ చేరుకొని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావును కలిసి బాధితులంతా పేదలని, మానవతా దృక్పథంతో సత్వర సాయమ ఒదించి, న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖామంత్రి ఎం.రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించి, పరిస్థితిని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన రవాణా శాఖ అధికారులు రూ.9.75 లక్షలు సత్వర సాయంగా విడుదల చేశారు. దీనికి సంబంధించి శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమాచారం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాధితులకు న్యాయం చేస్తామని, కూటమి ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎస్.రవికి - రూ.50 వేలు, రెడ్డి రమేష్ (హమాలీ)కు రూ.5లక్షలు, విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కె.రమేష్ (టాటా మ్యాక్సీ డ్రైవర్)కు రూ. 4లక్షలు, పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బి.సుందరరావుకు (రిక్షా కార్మికుడు) రూ.25 వేలు మంజూరయ్యాయి.

చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామ పాఠశాల సమీపంలో ఉన్న చెత్తను శనివారం తొలగించారు. పాఠశాల సమీపంలో అపారిశుధ్యం ఈనెల 24న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చెత్తను తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా చేశారు.

పోలమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారిని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన శనివారం దర్శించుకున్నారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన పోలమాంబ అమ్మవారిని భక్తి శ్రద్ధలతో ముక్కును చెల్లించుకున్నారు. ఆయన వెంట శంబర ఎంపిటిసి సభ్యులు తీళ్ల పోలినాయుడుతో పాటు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రవాసాంధ్ర భరోసా బీమా' ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, భద్రతను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎన్ఆర్‌టి సొసైటీ ద్వారా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "ప్రవాసాంధ్ర భరోసా బీమా" పథకాన్ని ప్రారంభించింది. కేవలం తక్కువ ప్రీమియంతో రూ. 10 లక్షల వరకు ఆర్థిక రక్షణను కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ పథకం ద్వారా 18 నుండి 60 ఏళ్ల ఉన్న ఉద్యోగులు, వలస కార్మికులు, విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు లబ్ధి పొందవచ్చు. ఉద్యోగులు/వలస కార్మికులు మూడేళ్లకు కేవలం రూ.590, విద్యార్థులు ఏడాదికి కేవలం రూ. 218/ మాత్రమే బీమా చెల్లించాలి. ప్రమాదం కారణంగా బీమా చేయబడిన వ్యక్తి మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా వారి కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం అందించబడుతుంది. ప్రమాదంలో మరణించిన వారి భౌతిక కాయాన్ని స్వదేశానికి తరలించడానికి, అంగవైకల్యం కలిగిన వ్యక్తి ఒక సహాయకునితో పాటు తిరిగి వచ్చేందుకు సాధారణ తరగతి విమాన ఛార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రమాదం వల్ల సంభవించే గాయాలై ఆసుపత్రి ఖర్చుల కింద రూ. 1 లక్ష వరకు చెల్లింపు లభిస్తుంది. ఉద్యోగ సమయంలో కంపెనీ యాజమాన్యంతో న్యాయపరమైన సమస్యలు తలె త్తితే, న్యాయ పరిష్కార ఖర్చుల కింద రూ.45 వేల వరకు చెల్లింపు ఉంటుంది. ఈ పథకంలో బీమా చేయబడిన మహిళా ఉద్యోగులకు ప్రసూతి ఖర్చుల నిమిత్తం ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణ ప్రసూతికి రూ. 35 వేల వరకు, సిజేరియన్ ఆపరే షన్‌కు రూ. 50వేల వరకు ఆసుపత్రి ఖర్చులు చెల్లిం చబడతాయి. ఈ బీమా పొందడానికి దరఖాస్తు దారులు పాస్‌పోర్ట్ ఫ్రంట్, బ్యాక్ పేజీలతో పాటు, వీసా, సివిల్ ఐడీ సమర్పించవలసి ఉంటుంది. ప్రవా సాంధ్రులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఎపిఎన్ ఆర్‌టి సొసైటీ విజ్ఞప్తి చేసింది. మరిన్ని వివరాలకు ఎపిఎన్ఆర్‌టి వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

పక్కాగా ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి - సీతానగరం

ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపడుతూ వ్యాధులు గుర్తించాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని కె.వెంకటాపురంలో హెల్త్, వెల్నెస్ కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య తనిఖీల రికార్డులు పరిశీలించి నమోదవుతున్న అనారోగ్య సమస్యల వివరాలు తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణపై స్పష్టత ఉండాలన్నారు. కేంద్రంలో మందులు తనిఖీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సిడి సర్వే తీరుపై ఆరా తీసి ఆన్లైన్ నమోదు పరిశీలించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించి అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, కేన్సర్ లక్షణాలు గుర్తించాలన్నారు. ముఖ్యంగా నోటి,రొమ్ము,సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ముందస్తుగా గుర్తించి క్యాన్సర్ ముప్పు నుండి తప్పించే దిశగా కృషి చేయాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పై ఇదివరకే అందరికీ శిక్షణ ఇవ్వడం జరిగిందనీ గుర్తు చేశారు. స్కూల్, అంగన్వాడీ పిల్లల స్క్రీనింగ్‌పై ఆరా తీశారు. ఏ చిన్న అనారోగ్య లక్షణాన్ని గుర్తించినా తక్షణమే చికిత్స అందేలా చూడాలన్నారు. సంచార చికిత్స శిబిరంలో దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ, వారి ఆరోగ్యం మెరుగుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం 104 వాహనంలో మందులు, ఇసిజి పరికరం పని తీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సంధ్య, వైద్య సిబ్బంది,104 సిబ్బంది ఉన్నారు.



మందులను పరిశీలిస్తున్న జగన్‌మోహన్‌రావు

రోడ్డు మరమ్మతులకు 'చిరు' సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న పాత బస్టాండ్ కూడలి వద్ద పెద్ద ఎత్తున రోడ్డుకు గుంతలు పడ్డాయి. రాష్ట్రంలో ఉన్న ప్రాంతాల నుంచి ఒడిస్సా, ఛత్తీస్‌గడ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాలకు ఈ రోడ్డు గుండా ప్రతిరోజు వందలాది భారీ వాహనాల రాకపోకలు సాగించడం వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ గోతుల గుండా ప్రయణించేందుకు పట్టణ ప్రజలు నా నా అవస్థలు పడుతున్నప్పటికీ, అటు ప్రజా ప్రతినిధులు గాని, మున్సిపల్ పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ, ఆర్అండ్‌బి అధికారులకు గానీ పట్టించుకోలేదు. దీంతో పట్టణానికి చెందిన చిరంజీవి అభిమానులు, మటన్ షాప్ యజమాని వహాబ్ ముందుకు వచ్చి తన సొంత నిధులతో 8 బస్తాలు సిమెంటు, ఆఫ్ ట్రాక్టర్ 20 యంయం పిక్క రాయి, ఆఫ్ ట్రాక్టర్ ఇసుకను తెప్పించి నలుగురు భవన నిర్మాణ కార్మికులకు కిరాయి ఇచ్చి పాత బస్టాండ్ వద్ద ఉన్న గోతులను కప్పించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న వ్యాపారస్తులు, వాహన చోధకులు, ట్రాఫిక్ పోలీసులు వాహబ్‌కు అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న స్థానికులు

మా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించండి

మంత్రి సంధ్యారాణికి దాగరవలస, బొడ్డవలస మహిళల వినతి

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని బొడ్డవలస, దాగరవలస గ్రామాల మధ్య సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో గర్భిణులు అనారోగ్యంతో ఉన్న వాళ్ళు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దాగరవలస మహిళలు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డ వలస గ్రామ మహిళలు మాట్లాడుతూ బొడ్డవలస, దాగర వలస గ్రామాల మధ్య ఉన్న రహదారికి ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడి చిధ్రమైందని, దీంతో అవస్థలు పడుతున్నామని చెప్పారు. ఈ రెండు గిరిజన గ్రామాల మధ్య కనీస రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవ సమయాల్లో గర్భిణులను ఆసుపత్రులకు తరలించడానికి సరైన రోడ్డు లేక డోలీల్లో, లేదా కష్టతరమైన మార్గాల్లో తీసుకువెళ్లాల్సిన పరిస్థితి నెలకొందనీ తెలిపారు. ఈ గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే కాలి నడకన బురదమయమైన, గుంతలతో నిండిన దారుల్లో ప్రయాణించాల్సి వస్తోందనీ దీంతో సమయానికి బడికి చేరుకోలేకపోవడం, వర్షాకాలంలో అనారోగ్యాల బారిన పడడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. గ్రామంలో పండించిన పంటలను మార్కెట్‌కు తరలించడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ తెలిపారు. తమ గ్రామానికి తక్షణమే రహదారి సౌకర్యాన్ని కల్పించి తమ కష్టాలు తీర్చాలని వారు మంత్రిని అభ్యర్థించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి రోడ్డు వేస్తే తమ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజనుల సమస్యను అర్థం చేసుకున్నాని త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ హామీతో తమ సమస్య పరిష్కారమవుతుందని ఆ గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి- సీతంపేట

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. శనివారం ఆయన స్థానిక బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని తిని, రుచిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పెడుతున్న భోజనం మరింత రుచికరంగా ఉండాలని, శుభ్రతతో ఉండాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ నీలం నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.